

## సింగిరెడ్డిపాలెం పొదుపు సంఘాల్లో రూ.24లక్షల గోల్‌మాల్

### సోషల్ ఆడిట్‌లో బయటపడ్డ భాగోతం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని సింగిరెడ్డిపాలెం పొదుపు సంఘాల్లో రూ.24లక్షలు గోల్‌మాల్ జరిగింది. సోషల్ ఆడిట్‌లో ఈ అవినీతి భాగోతం బయటపడింది. గ్రామ సర్పంచ్ ఒగ్గు కిరణ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో 2018 నుండి 2023 మధ్య కాలంలో 28 మహిళా సంఘాలకు సంబంధించి రూ.24,18,244 లెక్కల్లో తేడాలు వచ్చినట్లు డిఆర్‌పిలు అనిల్, కిషోర్ తేల్చారు. దీంతో మాజీ విఓఏ గణేష్ బాధ్యుడంటూ అధికారులు ప్రాథమిక నిర్ధారించారు. 2023లో నన్ను తొలగించే వరకు ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాలేదని కనీసం నాకు నోటీసులు ఇవ్వకుండా విచారణ చేయకుండానే నన్ను విధుల నుంచి తొలగించారని వాపోయారు. దాదాపు రూ.15లక్షలు సభ్యుల అనుమతితో ప్రామిసరీ నోటు రాసి ఇచ్చి దానికి నెలనెలా వడ్డీ చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. గ్రామంలో ఇంకా 60 మంది సభ్యులను విచారించి ఆడిట్ చేయాల్సి ఉందని వారి ఇండ్లకు తాళాలు వేసి ఉన్నాయన్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపితే అసలు విషయాలు బయటపడుతాయన్నారు. మహిళా సంఘాల సొమ్ము ఒక్క రూపాయి కూడా పక్కదారి పట్టలేదని చెప్పారు.

## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మునుగోడు మండలం చల్మెడ గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నల్లగొండ పట్టణంలోని ఐకాన్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చోల్లేడు గ్రామానికి చెందిన జనీగల కృష్ణయ్య,ఆయన భార్య లక్ష్మమ్మ,కుమారుడు కార్తీక్‌లను సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శుక్రవారం పరామర్శించారు.ఈసందర్భంగా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.అనంతరం బాధితులను,వారి కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి,అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కదిరి లింగయ్య,మాజీ సర్పంచ్ జనీగల మహేశ్వరి సైదులు,పెంబల జానయ్య,తాటికొండ సైదులు,ఇంద్రారెడ్డి,బొడ్డు నరసింహ,బీసం కృష్ణ,దాం నరసింహ,ఉడుగుండ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

## కేసుల్లో దర్యాప్తు వేగవంతం

### పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్‌పి కె నరసింహ శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డ్స్, ఫిర్యాదుల నిర్వహణను, కమాండెంట్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. రికార్డు త్వరితగతిన పూర్తి చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి బరోసా కల్పించాలని సూచించారు. ప్రజా సమస్యలపై సమాచారం అందిన వెంటనే వేగంగా స్పందిస్తూ బాధితుల వద్ద నుండి కేసులు నమోదు చేయాలన్నారు. సామాజిక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. సిబ్బంది అందరూ జట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఎస్‌ఐలు ఏడుకొండలు, ఐలయ్య, మహేందర్‌నాథ్, శివతేజ సిబ్బంది ఉన్నారు.

## స్వర్ణగిరిలో శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కల్యాణోత్సవం

### వైభవంగా జరిగిన శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవం

**ప్రజాపక్షం/భువనగిరి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించారు. 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళ భరిత పుష్పమాలలతో శోభాయ మానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. స్వర్ణగిరి దివ్య దేవస్థానంలో సాయంత్రం 7:30 నిమిషాలకు శ్రీ పద్మావతి అమ్మ వారి కి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణలు పాల్గొన్నారు.




## యాదగిరిగుట్ట దేవస్థానం కొండపై దుకాణాల టెండర్లు ఎప్పుడో?

### హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన స్థానిక భక్తుడు..

### దుకాణాల గడువు తేదీ ముందుకు వస్తున్నా టెండర్ల ఊసేదీ?

### టెండర్ల ద్వారా కోట్లరూపాయల ఆదాయం వచ్చే దుకాణాలపై ఇఒ చూపేది?




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** తెలంగాణ రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానంలో అన్ని విభాగాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో నోటిఫికేషన్ విడుదల అవుతున్న కొండపై ఉన్న తాత్కాలిక దుకాణాలకు సంబంధించిన టెండర్ల నోటిఫికేషన్ ప్రక్రియ విషయంలో మాత్రం దేవస్థాన అధికారుల చూపు సారించడం లేదు. కొండపై ఉన్న దుకాణాలను టెండర్లు వేయడం ద్వారా దేవస్థానానికి కోట్ల రూపాయలలో ఆదాయం సమకూరుతుందనే విషయం ప్రస్తుతం ఉన్న ఇఒ జె.భవాని శంకర్ (ఐఏఎస్) అధికారికి తెలియదు కాబోలు. అందుకే ఏటెండర్ అయినా మూడునెలల ముందే షెడ్యూల్ విడుదల చేసి టెండర్ల నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుంది. కాని కొండపైన దుకాణాల విషయంలో జాప్యం జరుగుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదనిపిస్తుంది. ఎందుకంటే ప్రతిదీ రూల్ ప్రకారంగా వ్యవహరించే దేవస్థాన అధికారులు కొండపైన దుకాణాల విషయంలో రూల్స్ పాటించకపోవడం అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.
వర్తక సంఘం పేరిట కొనసాగుతున్న దుకాణాలను టెండర్లు వెయ్యాలని స్థానిక భక్తుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనేపథ్యంలో కొండపై ఉన్న దుకాణాల గడువు దగ్గర పడుతున్నా టెండర్ల మాటే లేదని స్థానికులు పలుమార్లు ఈవో దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకపోయింది. అందుకు కారణం ఈవో జె భవాని శంకర్ (ఐఏఎస్) అధికారి వర్తక వ్యాపారులతో కుమ్మక్కై ఉండవచ్చనే ఆరోపణలు స్థానికంగా పెద్ద దుమారం రేపుతున్నాయి. అంతే కాకుండా వర్తక వ్యాపారాలకు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పైరవీల కారణంగా టెండర్ల నోటిఫికేషన్ ముందుకు సాగడం లేదనే ఆరోపణలు కూడా వెల్లువెత్తున్నాయి. కానీ హైకోర్టులో కేసు ఉన్నప్పటికీ కొండపై ఉన్న దుకాణాల సముదాయాన్ని టెండర్లు వేయవలసి ఉంటుందనే విషయం ఈవో జె భవాని శంకర్ (ఐఏఎస్)కి తెలుసో లేదో...? ఒకవేళ టెండర్లు చేసినట్లయితే దేవస్థానానికి వచ్చే కోట్ల రూపాయల ఆదాయం చూసి కళ్లు చెదురుతాయనే భయం ఇఒకు ఉన్నట్లు ఉందేమో...? కొండపైన వర్తక వెల్ఫేర్ సంఘం పేరిట సుమారు 10 దుకాణాలు కొనసాగుతూ దేవస్థాన్నికి ప్రతి నెల 14లక్షల రూపాయలు చెల్లిస్తూ సంవత్సరానికి 1కోటి 68 లక్షలు చెల్లిస్తూ 10 దుకాణాలను వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకొని వ్యాపారులు చేస్తూ దేవస్థానానికి కోట్ల రూపాయలలో గండి కొడుతూ వర్తక వ్యాపారులుగా కొండపై తిష్ట వేసుకుని గడువు తేదీ 31/05/2026 వరకు దుకాణాల టెండర్లు జరగకుండా పైరవీలు చేసి దేవస్థానానికి వచ్చే భక్తులను దోపిడీకి గురిచేస్తున్నారు. మొన్నటికి మొన్న జరిగిన సెల్ ఫోన్ కౌంటర్ టెండర్ సంవత్సరానికి 2కోట్ల 22లక్షలు కాగా, ఇలాగే మొన్న జరిగిన టెండర్ల వివరాలు గమనిస్తే దేవస్థానానికి ఒకొక్క టెండర్ ద్వారా ఎంత ఆదాయం సమకూరుతుందో వివిధ ప్రదేశాల్లో ఉన్న 10దుకాణాలకు సంవత్సరానికి కేవలం 1.68 లక్షలు మాత్రం ఆదాయం సమకూరుతుందనే అలోచన దేవస్థానంలో ఉన్న ఉన్నతాధికారులు ఈవో ఎందుకు గమనించటం లేదు. అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కొండపైన ఉన్న దుకాణాలను టెండర్లు వేస్తే ఒక్కో దుకాణానికి సుమారు 2కోట్ల ఆదాయం సమకూరుతుందనే విషయం ఉన్నతాధికారులు గమనించాలి. అంతే కాదు గడువు తేదీ 31/05/2026 దగ్గర పడుకున్నా దేవస్థాన రూల్స్ నియమనిబంధనల ప్రకారం మూడునెలల ముందే టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేయాలి కాని అన్ని టెండర్ల విషయంలో ముందుగానే టెండర్ల నోటిఫికేషన్ ప్రక్రియ విడుదల చేసే దేవస్థాన అధికారులు కొండపై 10 దుకాణాల టెండర్ నోటిఫికేషన్ ప్రక్రియ ఎందుకు విడుదల చేయడం లేదో దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. భవాని శంకర్ (ఐఏఎస్) చెబుతారా..? లేక గత ఈవోలలాగే టెండర్లు వేయకుండా వర్తక వ్యాపారులతో మంతనాలు జరుపుతారా..? లేక హైకోర్టులో ఉన్న పిటిషన్‌ను గౌరవిస్తూ టెండర్ల ప్రక్రియ అమలు చేస్తారా..? వేచిచూడాల్సిందే.

## పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

### మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు

**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణంలోని12 వార్డులలోని శివాజీ నగర్‌లో ఐదేళ్ల బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. శంకర్ కుమారుడు శరత్ చంద్ర కాంత్ పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క అకస్మాత్తుగా దాడి చేసి ముఖంపై తీవ్ర గాయాలు చేసింది. బాలుడి అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి కుక్కను తరిమికొట్టి తల్లిదండ్రులతో కలిసి సమీప ప్రైవే టు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. గత నెల 28న జరిగిన పురపాలక సంఘం సర్వసభ్య సమావేశంలో కూడా ఈ సమస్యపై చర్చించినట్లు అధికారులు తెలిపారు. వీధి కుక్కల నియంత్రణ, కోతుల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్ పేర్కొన్నారు.



## దొడ్డి కొమరయ్య పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తి




సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకొని యాదగిరిగుట్ట మండలం చిన్న కందుకూరు గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్య అంశాలను ప్రస్తావించారు. నిరంకుశ రాచరిక వ్యవస్థను గడగడలాడించిన ఘనత కొమరయ్యదేనని, ఆయన బలిదానంతోనే తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరిగిన పోరాట ఫలితంగానే 3000 గ్రామాలు విముక్తి పొందాయని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర సిపిఐది అని గుర్తు చేశారు.నేటి యువత చెడు మార్గాల వైపు మళ్లకుండా, సామాజిక స్పృహతో దేశాభివృద్ధికి తోడ్పడాలని, దొడ్డి కొమరయ్య వంటి వీరుల చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పేరబోయిన పెంటయ్య పాల్గొన్నారు. అలాగే చిన్న కందుకూరు ఉపసర్పంచ్ కాటం శ్రీకాంత్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ సాయుధ పోరాటంలో నెలకొరిగిన తొలి అమరజీవి దొడ్డి కొమరయ్య అని బిసి హక్కుల సాధన సమితి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాపోలు నవీన్, చిలకరాజు శ్రీను, ఊదరవెంకన్న, కొమ్రరాజు వెంకట్, శ్రీనివాస్, సైదులు, శేఖర్, రమేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

**దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి**

**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసి అమరుడైన కొముర య్య చిరస్మరణీయుడని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్,బి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ వారి సేవలను కొనియాడారు. తెలంగాణ సాయిధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణ పరిధిలోని ఆర్జాల బావి గ్రామ సర్కిల్లో ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ జెడ్‌పిటిసి శబరయ్య,వంగూరు నారాయణ యాదవ్,గుండు వెంకటేశ్వర్లు,కర్నాటి విజయకుమార్,సుక్కర్బోయిన పరమేష్,కోటేష్ యాదవ్ కుంటి గొర్ల లింగయ్య పాల్గొన్నారు.





## పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో లబ్ధిదారులు నడింపల్లి లక్ష్మయ్య, మైనవారిగూడెం గ్రామంలో లబ్ధిదారులు గంగపూరి రేణుకయాదయ్యలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆయన డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్‌నేతతో కలిసి ప్రారంభించారు. అనంతరం సన్నబియ్యం ప్రవేశపెట్టి ఏడాది అయిన సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడి ఇంట్లో వారి కుటుంబసభ్యులతో కలిసి సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పేద ప్రజల సొంత కలలను నెరవేరుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రజా ప్రభుత్వంపై చూపిస్తున్న ఆదరణకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గర్వ పడుతున్నానని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, మండల నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఎఐపిఎస్ఒ జిల్లా కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్ఒ) నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 4వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు నల్లగొండలోని జిల్లా పరిషత్ కార్యాలయం పక్కన ఉన్న పిఆర్‌టియూ భవనంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షవర్గం కట్ట వెంకటరెడ్డి,అనంతుల శంకరయ్య, గుర్రం వెంకటరెడ్డి,జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య తెలిపారు.ఈ సమావేశానికి ఎఐపిఎస్ఒ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు హాజరుకానున్నారు.సమావేశంలో సభ్యత్వ విస్తరణ, జిల్లా నిర్మాణం,భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా సమితి సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## భూదానోద్యమ వజ్రోత్సవాల పాదయాత్ర

**ప్రజాపక్షం/భూధన్ పోచంపల్లి :** భూదాన ఉద్యమం మొదలై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో సంఘమిత్ర ఆధ్వర్యంలో ఏప్రిల్ 16 నుండి 18 వరకు శివరాంపల్లి నుండి భూదాన్ పోచంపల్లి వద్దకు పాదయాత్ర చేపడుతున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు నిజాం కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ తడక యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో యువతకు పిలుపునిచ్చారు. 1951 ఏప్రిల్ 18న ఒక చిన్న గ్రామం ప్రపంచ చరిత్రను మార్చిన సుదినాన్ని గుర్తు చేస్తూ అహింసా సమానత్వము దానధర్మము పేదలకు భూదానాన్ని చేయాలనే సంకల్పంతో గాంధే య నినాదంతో ఆచార్య వినోబా భావే తలపెట్టిన భూదానోద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని భావితరాలకు చరిత్రను తెలపవలసిన బాధ్యత అందరిపై ఉందని మేల్కొల్పుతూ సాగే ఈ పాదయాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పోరాట పార్టీ సిపిఐకి చేయూతనివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారనికై ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న సీపీఐ నిర్మాణానికి తోడ్పాటు ఇవ్వాలని, పోరాటాలకు చేయూతనివ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా తుర్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు తదితర ప్రజాసంఘాలను నిర్మించి, వెట్టి చాకిరి నిర్మూలనకు, కార్మికులు , కర్షకులను దోపిడి నుండి విముక్తి చేయడానికి సిపిఐ పోరాటాలు సాగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సిలువేరు దుర్గయ్య, సహాయ కార్యదర్శి గుంటిపల్లి సత్తయ్య, మండల కార్యవర్గ సభ్యులు మన్నోజు సిద్దినరసింహ చారి, దుడుక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆదేశానుసారం ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మర్యాల గ్రామంలో మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశం ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేటట్లు చూడా లని కరపత్రాలు పంచుతూ విరా ళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నరసింహ, కృష్ణ, రాజు, ప్రసాద్, మోహన్, బాలరాజు, తేజ, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.






## జటంగి నర్సయ్య మరణం సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు జటంగి నర్సయ్య మరణించడంతో శుక్రవారం మరిపడిగ గ్రామంలో నర్సయ్య పార్థివ దేహంపై ఎర్ర జెండా కప్పి నివాళులర్పించిన సిపిఐ సీనియర్ నాయకులు పాల్వాయి దయాకర్ రెడ్డి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ సినియర్ నాయకులు జటంగి నర్సయ్య మరణం సిపిఐకి తీరని లోటు అని, నాటి నుండి నేటి వరకు పార్టీలో ఉంటూ పార్టీ ఇచ్చే సూచనలు, సలహాలు తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీని ముందుకు తీసుకువెళ్ళడంతో నర్సయ్య పాత్ర కీలకం అని, ఆయన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాదగిరి, సినియర్ నాయకులు వెంకటయ్య,బక్కయ్య తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :**గుడ్ ఫ్రైడే సందర్భంగా నల్లగొండ పట్టణంలో క్రైస్తవ భక్తులు గంభీర వాతావరణంలో ప్రత్యేక ప్రార్థనలు,ఊరేగింపులు నిర్వహించారు.పట్టణం లోని కలెక్టరేట్ సమీపంలో హౌస్‌ఆఫ్ ప్రేయర్ చర్చ్,గడియారం సెంటర్ లోని బాప్టిస్ట్ చర్చి తో పాటు దేవరకొండ రోడ్డు,హైదరాబాదు రోడ్డు,తదితర ప్రాంతాలలోని ప్రాంతాలలోని పలు చర్చిలలో క్రైస్తవులు సిలువ గీతాలను ఆలపించి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేవరకొండ రోడ్డులో గల మరియా మతచర్చిలో యేసు క్రీస్తు శిలువ వేయబడిన బాధలను స్మరించుకుంటూ విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చర్చిల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా,యేసు క్రీస్తు శిలువ మోసిన ఘట్టాలను ప్రతిబింబిస్తూ యువకులు నాటకీయ ప్రదర్శనలు చేశారు.శిలువ మోస్తూ వీధులలో ఊరేగింపుగా వెళ్లడం,కొరడాలతో శిక్షించే సన్నివేశాలను ప్రదర్శించడం ద్వారా ఆకాలం సంఘటనలను గుర్తుచేశారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించడంతో పాటు శాంతి,సహనం,ప్రేమ అనే సందేశాలను ఆచరించాలని పాస్టర్లు పిలుపునిచ్చారు.గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ప్రధాన చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు కొనసాగాయి.ఈ వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ప్రశాంతంగా జరిగాయి.ఈకార్యక్రమంలో పాస్టర్స్ వినోద్ కుమార్, సుందర్, వెంకటయ్య, దానియల్, రంజిత్ కుమార్, శ్రీహరి ఉన్నారు.





